సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శనివారం । 11 । జనవరి । 2025



చీనీ టన్ను రూ.24,320

అనంతపురం మార్కెట్‌యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.24,320 పలికాయి. మార్కెట్‌కు 18 టన్నుల కాయలు వచ్చాయి.



టమాట కిలో రూ.11

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.11, కనిష్టం రూ.7, సరాసరి రూ.9 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
31.3°/12.9°

జిల్లా పరిధిలో శుక్రవారం చలి వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

వీరభద్రుని సేవలో కేంద్ర మంత్రి



ఆలయ చరిత్రను తెలుసుకుంటున్న కేంద్ర సహాయ మంత్రి పంకజ్ చౌదరి

లేపాక్షి: ప్రముఖ పర్యాటక కేంద్రమైన లేపాక్షి వీరభద్రస్వామి ఆలయాన్ని కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి దంపతులు శుక్రవారం సందర్శించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి సమక్షంలో ఆలయ అర్చకులు వారికి ఘన స్వాగతం పలికారు. ఆలయంలోని శిల్పాలు, చిత్రలేఖనాలతో పాటు నాట్యమంటపం, కల్యాణ మంటపం, నాగేంద్రుని విగ్రహం, సీతమ్మ పాదం తదితర వాటిని తిలకించి ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం ఆలయంలోని వీరభద్ర స్వామి, దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ విశిష్టతను అర్చకుల ద్వారా తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. ఆ తర్వాత పంకజ్‌చౌదరి దంపతులను దేవదాయశాఖ అధికారులు సత్కరించారు. పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్, తహసీల్దార్ సౌజన్య లక్ష్మి, రూరల్ సీఐ జనార్దన్, ఎస్‌ఐ నరేంద్ర, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నిలకడగా ఎండు మిర్చి ధరలు



మార్కెట్‌కు వచ్చిన ఎండు మిర్చి

హిందూపురం అర్బన్: హిందూపురం వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం ఎండు మిర్చి ధరలు నిలకడగా సాగాయి. మార్కెట్‌లో ఈ నామ్‌లో వేలం పాటలు జరగ్గా మొదటి రకం ఎండు మిర్చి క్వింటా రూ.16,500, రెండో రకం రూ.9,000, మూడో రకం రూ.7,000 పలికినట్లు మార్కెట్ కార్యదర్శి చంద్రమౌళి తెలిపారు.

పురాతన ఆలయంలో విగ్రహాల ధ్వంసం



ధ్వంసమైన విగ్రహాలు

అగళి: పురాతన ఆలయంలోని విగ్రహాలను దుండగులు ధ్వంసం చేశారు. గుప్త నిధుల కోసం కొందరు వ్యక్తులు ఈ దురాగతానికి పాల్పడినట్లుగా స్థానికులు అనుమానిస్తున్నారు. వివరాలు... అగళి మండలం హెచ్‌డీ హళ్లి గ్రామ శివారున అత్యంత పురాతనమైన భైరప్ప స్వామి ఆలయం ఉంది. ఈ ఆలయంలో గుప్త నిధులు ఉన్నట్లుగా అనుమానాలు వ్యక్తం కావడంతో కొందరు వ్యక్తులు పథకం ప్రకారం గురువారం రాత్రి విధ్వంసానికి పాల్పడ్డారు. ఆలయంలోని మూలవిరాట్‌ను ముక్కలు ముక్కలుగా ధ్వంసం చేశారు. అనంతరం తవ్వకాలు సాగించారు. గర్భాలయం మొత్తం గుంతల మయమయింది. శుక్రవారం ఉదయం ఆలయం వద్దకు వెళ్లిన స్థానికులు విషయాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై విచారణ కొనసాగుతోంది.

18న నవోదయ ప్రవేశ పరీక్ష

లేపాక్షి/పుట్టపర్తి: లేపాక్షి జవహర్ నవోదయ విద్యాలయలో 6వ తరగతిలో ప్రవేశాలకు ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 18న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు డీఈఓ కృష్ణప్ప, విద్యాలయ ప్రిన్సిపాల్ నాగరాజు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష ఉంటుంది. ఉదయం 10.30 గంటల్లోపు కేటాయించిన పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు చేరుకోవాలి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దరఖాస్తు చేసుకున్న 7,987 మంది విద్యార్థులకు 34 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. విద్యార్థుల అడ్మిట్ కార్డులను www.navodaya.gov.in వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడు చేసుకోవచ్చు. లేదా, జవహర్ నవోదయ విద్యాలయ, లేపాక్షిలోని కార్యాలయం నుంచి పొందవచ్చు. సందేహాల నివృత్తికి 95732 87480లో సంప్రదించవచ్చు.

వైకుంఠ వైభవం



కదిరి: ఆలయ వీధిలో శ్రీవారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు (ఇన్‌సెట్) అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనారసింహుడు



హిందూపురం: లక్ష్మీ పద్మావతి సమేత పేట వెంకటరమణస్వామి

- భక్తులతో పోటెత్తిన ఖాద్రీశుడి ఆలయం
- గురువారం అర్ధరాత్రి నుంచే కిక్కిరిసిన క్యూలైన్లు
- ఉత్తర ద్వారం నుంచి స్వామిని దర్శించుకున్న భక్తులు

కదిరి: వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. గురువారం అర్ధరాత్రి నుంచే భక్తులు క్యూలైన్ల వద్ద బారులు తీరారు.

వేకువజామునుంచే దర్శనం..

వైకుంఠ ఏకాదశి ఘడియలు ప్రవేశించగానే శుక్రవారం వేకువ జామున 3 గంటల ప్రాంతంలో శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనారసింహుడిని వైకుంఠ ద్వారం (ఉత్తర గోపురం) వద్దకు చేర్చారు. ప్రత్యేక పూజల అనంతరం వేకువ జాము నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఖాద్రీశుడు వైకుంఠ ద్వారం గుండా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయం మొత్తం వివిధ రకాల పుష్పాలు, పండ్లతో చేసిన అలంకరణ భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది.

తగ్గిన భక్తుల సంఖ్య..

ఏటా ముక్కోటి ఏకాదశి సందర్భంగా లక్ష మందికి పైగా భక్తులు నరసింహస్వామిని వైకుంఠ ద్వారం గుండా దర్శించుకునేవారు. అయితే ఈ మధ్యనే తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు చనిపోవడంతో ఆ ప్రభావంతో కదిరిలో భక్తుల సంఖ్య తగ్గిందని చెప్పవచ్చు. దాదాపు 80 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

పల్లకీపై వచ్చిన శ్రీవారు..

స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సతీసమేతంగా తెల్లవారు జామునే ఆలయం చేరుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. స్వామివారి అలంకరణ అనంతరం శ్రీవారిని పల్లకీలో మోసుకుంటూ ఉత్తర రాజగోపురం వద్దకు తీసుకొచ్చారు. హిందూపురం పార్లమెంట్ సభ్యులు బీకే పార్థసారథి స్వామివారిని దర్శించుకున్నారు.

చలిని లెక్కచేయని భక్తులు..

ఖాద్రీశుడి వైకుంఠ ద్వార దర్శనం కోసం భక్తులు రాత్రి చలిని, పగలు మండుటెండను లెక్క చేయలేదు. సర్వదర్శనం కన్నా రూ.30 టికెట్ క్యూలైన్‌లోనే భక్తుల రద్దీ ఎక్కువగా కనిపించింది. వైకుంఠ ద్వార దర్శనం కోసం భక్తుల రద్దీని ముందే ఊహించి అందుకు తగ్గ ఏర్పాట్లు చేసినట్లు ఆలయ సహాయ కమిషనర్ వెండిదండి శ్రీనివాస రెడ్డి తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కదిరి డీఎస్పీ శివనారాయణస్వామి నేతృత్వంలో బందోబస్త్ ఏర్పాటు చేశారు.

జిల్లా వ్యాప్తంగా సందడి

హిందూపురం పేట వెంకటరమణస్వామి, ధర్మవరం చెన్నకేశవస్వామి ఆలయాలతో పాటు జిల్లాలోని అన్ని ఆలయాల్లో భక్తులు స్వామి వార్లను ఉత్తర ద్వార దర్శనం చేసుకొని తరించారు. పలుచోట్ల స్వామి వారి ఉత్సవ మూర్తుల ఊరేగింపు వైభవంగా నిర్వహించారు.



ధర్మవరం: భక్తులతో కిక్కిరిసిన లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం

రోడ్డు ప్రమాదాలకు చెక్ పెడదాం

- కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: రోడ్డు ప్రమాదాలకు చెక్ పెట్టేలా ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జాతీయ భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని రవాణాశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన బ్యానర్లు, పోస్టర్లను కలెక్టర్ టీఎస్ చేతన్ ఎస్పీతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు తరచుగా జరిగే ప్రాంతాలపై దృష్టిసారించి ప్రమాదాల నివారణకు కృషిచేయాలన్నారు. ఎస్పీ వి.రత్న మాట్లాడుతూ పోలీస్, రవాణాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ప్రజలకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డీఆర్‌ఓ విజయసారధి, డీటీఓ కరుణసాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్వేని వేగవంతం చేయండి..

జిల్లాలో కుష్టు వ్యాధి సర్వేను వేగవంతంగా చేయాలని, ప్రతి ఇంటినీ ఏఎన్‌ఎం, వలంటీర్లు సందర్శించాలని, వైద్యఆరోగ్యశాఖ అధికారులు కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో కుష్టు నిర్మూలన, వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమంపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం జరిగింది. 20 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకూ 14 రోజుల పాటు వైద్య ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఫిరోజ్ బేగం, జిల్లా లెప్రసీ అధికారి డాక్టర్ తిప్పయ్య తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదాల నివారణపై పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

పారదర్శకంగా ఉచిత ఇసుక..

జిల్లాలో ఉచిత ఇసుక సరఫరాను పారదర్శకంగా అమలు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో జిల్లాలో ఉచిత ఇసుక అమలుపై డీఎస్‌ఎస్‌సీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన ఇసుకను సరఫరా చేయాల్సిన బాధ్యత మైనింగ్ అధికారుదేనన్నారు. ఎస్పీ వి.రత్న మాట్లాడుతూ ఎక్కడైనా ఇసుక అక్రమ తవ్వకాలు ,రవాణా జరుగుతుంటే డయల్ 100, 102కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. జేసీ అభిషేక్ కుమార్, డీఆర్‌ఓ విజయ సారధి, జిల్లా గనుల శాఖ అధికారి పెద్దిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించాలి

జిల్లా ప్రభుత్వ యంత్రాంగం ఆధ్వర్యంలో జనవరి 26న పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక సమావేశ మందిరంలో గణతంత్ర వేడుకల నిర్వహణపై అధికారులతో చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ గణతంత్ర వేడుకలను అన్ని శాఖల అధికారులు కలిసి విజయవంతం చేయాలన్నారు. తాగునీరు, వసతి ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ శకటాల ప్రదర్శనకు ఏర్పాట్లు చేయాలన్నారు.

ఇద్దరు బిడ్డలతో సహా.. మహిళ ఆత్మహత్యాయత్నం

పుట్టపర్తి అర్బన్: కుటుంబ సమస్యలకు తోడు ముక్కోటి ఏకాదశి రోజున భర్త తనను కొట్టాడని అవమాన భారంతో ఓ మహిళ తన ఇద్దరు బిడ్డలతో కలిసి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వివరాల్లోకి వెళితే.. పుట్టపర్తి పట్టణంలోని కుమ్మరి పేటకు చెందిన బాలరాజు, నాగవేణి దంపతులు తరచూ గొడవ పడేవారు. వారికి ఆరేళ్ల పాప, మూడేళ్ల కుమారుడు ఉన్నారు. గురువారం రాత్రి, శుక్రవారం ఉదయం కూడా ఇద్దరూ గొడవ పడ్డారు. బాలరాజు.. నాగవేణిపై చేయి చేసుకున్నాడు. పండుగ రోజు వీధిలో ఉన్న వాళ్లందరి ముందర తనను కొట్టాడన్న ఆవేశంలో నాగవేణి తన కుమార్తె, కుమారుడిని ఎత్తుకొని చిత్రావతి నదిలో ఉన్న చెక్ డ్యాంలో దూకింది. అక్కడే ఉన్న స్థానికులు వెంటనే ఆమెనూ, ఇద్దరు బిడ్డలనూ బయటకు తీసి వెంటనే సత్యసాయి జనరల్ ఆస్పత్రిలో చేర్చారు. తల్లీ కుమార్తెకు ప్రాథమిక చికిత్స అందించి ఎలాంటి ప్రమాదం లేదని ఇంటికి పంపారు. అయితే మూడేళ్ల కుమారుడు నదిలో ఎక్కువ నీళ్లు తాగడంతో పరిస్థితి విషమంగా ఉందని వెంటనే అనంతపురం ఆస్పత్రికి తరలించారు.



సత్యసాయి ఆస్పత్రిలో చేరిన నాగవేణి, ఆమె కుమార్తె

క్రీడా సమ్మేళనానికి 'హిల్‌వ్యూ' ముస్తాబు



క్రీడోత్సవాలకు సిద్ధమైన హిల్‌వ్యూ స్టేడియం



విద్యార్థుల ముందస్తు ప్రదర్శన

- నేటి ఉదయం 8 గంటల నుంచి కార్యక్రమాలు
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్

పుట్టపర్తి రూరల్: సత్యసాయి సాంస్కృతిక క్రీడా సమ్మేళనానికి హిల్‌వ్యూ స్టేడియం సిద్ధమైంది. సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో శనివారం స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్ నిర్వహించనున్నారు. ఇందుకోసం సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ, సెంట్రల్ ట్రస్టు ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

'హిల్‌వ్యూ'లో ఇంటర్నేషనల్ క్రికెట్ మ్యాచ్..

బాబా భౌతికంగా ఉన్న రోజుల్లో 1995లో సత్యసాయి యూనిటీ కప్ పేరిట ఇండియా 11, వరల్డ్ 11 మధ్య ఇంటర్నేషనల్ క్రికెట్ మ్యాచ్ ఈ మైదానంలోనే నిర్వహించడం గమనార్హం. ఒక రకంగా చెప్పాలంటే.. ఏటా జనవరి 11న జరిగే సత్యసాయి సాంస్కృతిక క్రీడా సమ్మేళనం ఈ ప్రాంత వాసులకే కాక ప్రపంచం నలుమూలల నుండి వచ్చే సాయి భక్తులకు ప్రత్యేకం. విలువలతో కూడిన విద్యతో పాటు విద్యార్థుల్లో మానసికోల్లాసాన్ని నింపేందుకు సాంస్కృతిక క్రీడా సమ్మేళనం నాలుగు దశాబ్దాల క్రితం ప్రారంభించారు. శ్రీ సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలోని పుట్టపర్తి, బెంగళూరు బృందావనం, ముద్దెనహళ్లి, అనంతపురం క్యాంపస్ విద్యార్థులు, ఈశ్వరమ్మ, ఉన్నత పాఠశాల, ప్రైమరీ పాఠశాల విద్యార్థులు, వైట్‌ఫీల్డ్ స్విమ్స్ నర్సింగ్ విద్యార్థులు సమ్మేళనంలో పాల్గొంటారు. అద్భుత సాహసోపేత విన్యాసాలు ప్రదర్శించేందుకు విద్యార్థులు ఉవ్విళ్లూరుతున్నారు.



ముస్తాబైన స్పోర్ట్స్‌మీట్ సభావేదిక

స్పోర్ట్స్ మీట్ ఇలా..

శనివారం ఉదయం 8 గంటలకు బ్రాస్‌బాండ్‌తో కూడిన మార్చ్ ఫాస్ట్‌తో మొదలవుతుంది. 9 గంటలకు క్రీడా జ్యోతి వెలిగించి పతాకాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం 10.30 గంటల వరకూ సాంస్కృతిక క్రీడా విన్యాసాలు ఉంటాయి. సాయంత్రం 4.15 నుంచి 7 గంటల వరకూ ప్రత్యేక ప్రదర్శనలు నిర్వహిస్తారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీలో పలువురికి చోటు

సాక్షి, పుట్టపర్తి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా పార్టీ కమిటీలో వివిధ హోదాల్లో పలువురిని నియమించారు. ఈమేరకు శుక్రవారం సాయంత్రం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా బైకా విజయభాస్కర్‌రెడ్డి (కదిరి), వీఎస్ పురుషోత్తంరెడ్డి (హిందూపురం), శివప్రసాద్ (మడకశిర), కోనపల్లి రఘురామిరెడ్డి (పెనుకొండ), సానె రాజశేఖర్‌రెడ్డి (రాప్తాడు), బుక్కపట్నం కేశవ (పుట్టపర్తి), ఎం.సాయికుమార్ (ధర్మవరం), జనరల్ సెక్రెటరీలుగా కేవీ ప్రణీత్‌రెడ్డి (కదిరి), ఏఎస్ దిలీప్‌కుమార్ (హిందూపురం), భీమిరెడ్డి నాగేశ్వర్‌రెడ్డి (రాప్తాడు), పోలె వెంకటరెడ్డి (పుట్టపర్తి), కోటి సురేశ్ కుమార్ (ధర్మవరం), ట్రెజరర్‌గా పి.రామక్రిష్టారెడ్డి (పెనుకొండ), ఆర్గనైజేషనల్ సెక్రెటరీలుగా ఎన్‌టీ తిప్పేరుద్ర (హిందూపురం), ఎం.గిరీశ్‌బాబు (హిందూపురం), కదిరి రామకృష్ణారెడ్డి (రాప్తాడు), నీరుకంటి నారాయణరెడ్డి (రాప్తాడు), ఇ.జయకుమార్ (మడకశిర), డీఈ నటరాజు (మడకశిర), ఎం.భాస్కర్ (ధర్మవరం), బి.ప్రభాకర్‌రెడ్డి (ధర్మవరం), ఎం.రఘురామయ్య (పుట్టపర్తి), ఎస్.హనుమంతరెడ్డి (పుట్టపర్తి), హరిజన వెట్టి కంబాలప్ప (పెనుకొండ), బోరెడ్డిపల్లి కురుబ నరసింహమూర్తి (పెనుకొండ), ఆంజనేయరెడ్డి (కదిరి), ఎస్.ఈశ్వరయ్య (కదిరి) నియమించారు. అలాగే యాక్టివిటీ సెక్రెటరీలుగా డి.శ్రీనివాస్ రెడ్డి (హిందూపురం), డి.గిరిధర్‌బాబు (హిందూపురం), కురుబ వెంకటరాముడు (రాప్తాడు), మంత్రి నాగరాజు (రాప్తాడు), మద్దన్న (మడకశిర), లోకేశ్ (మడకశిర), కె.రమాదేవి (ధర్మవరం), జొల్లిరెడ్డి అశ్వర్థ (ధర్మవరం), వై.మధుసూదన్‌నాయుడు (పుట్టపర్తి), ఎం.మహబూబ్‌సాబ్ (పుట్టపర్తి), తురకలాపట్నం గుట్టి నరేంద్రరెడ్డి (పెనుకొండ), ఎస్.ఆంజనేయులు నాయక్ (పెనుకొండ), బి.చిన్నక్రిష్ణారెడ్డి (కదిరి), నాగరాజు (కదిరి), అధికార ప్రతినిధులుగా ఆర్.శివశంకర్‌రెడ్డి (హిందూపురం), కర్రా హనుమంతరెడ్డి (రాప్తాడు), ఆనంద రంగారెడ్డి (మడకశిర), గుర్రం శ్రీనివాసరెడ్డి (ధర్మవరం), సి.ఓబులేసు (పుట్టపర్తి), మేడార శంకరప్ప (పెనుకొండ), వి.మహబూబ్‌బాషా (కదిరి) నియమితులయ్యారు.

వైఎస్సార్‌సీపీ మండల కమిటీల ఎన్నిక..

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ జాబితా శుక్రవారం సాయంత్రం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి విడుదల చేశారు. మండలాలకు కన్వీనర్లను నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. మడకశిర అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి స్టూడియో శ్రీనివాస్ (అగళి), జి.త్రిలోక్‌నాథ్ (అమరాపురం), నరసింహారెడ్డి (రొళ్ల), డీఎల్ యంజారేగౌడ్ (గుడిబండ), రామిరెడ్డి (మడకశిర), పుట్టా కమ్మప్ప (మడకశిర నగర పంచాయతీ) నియమించారు. హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి సి.రామాంజినప్ప (హిందూపురం రూరల్), టి.మన్సూర్ ఖాన్ (హిందూపురం క్లస్టర్ 1), సి.నాగరాజు (హిందూపురం క్లస్టర్ 2), ఎస్.నిస్సార్ (లేపాక్షి), ఎస్.రామకృష్ణారెడ్డి (చిలమత్తూరు), పెనుకొండ నియోజకవర్గానికి సంబంధించి బి.నరసింహులు (పెనుకొండ నగర పంచాయతీ), ఎస్.వీరాంజనేయరెడ్డి (గోరంట్ల), బీకే నరసింహమూర్తి (పరిగి), పి.సుధాకర్‌రెడ్డి (పెనుకొండ), బోయ తిమ్మయ్య (రొద్దం), గజేంద్ర (సోమందేపల్లి)లను నియమించారు. అలాగే రాప్తాడు నియోజకవర్గానికి సంబంధించి జొన్నగిరి బాలపోతన్న (ఆత్మకూరు), సాకే వెంకటేశ్ (రాప్తాడు), కుంపటి నాగమునెప్ప (కనగానపల్లి), మీనుగ నాగరాజు (రామగిరి), డోలా రామచంద్రారెడ్డి (సీకే పల్లి), బండి పవన్‌కుమార్ (అనంతపురం రూరల్ 1), దుగ్గుమర్రి గోవిందరెడ్డి (అనంతపురం రూరల్ 2), ధర్మవరం నియోజకవర్గానికి సంబంధించి ఎం.జయ రామిరెడ్డి (బత్తలపల్లి), ఎన్.రామయ్య (ధర్మవరం రూరల్), సీవీ నారాయణరెడ్డి (ముదిగుబ్బ), ఎ.రామాంజినేయులు (తాడిమర్రి) మండల కమిటీ అధ్యక్షులుగా నియమితులయ్యారు.

క్లుప్తంగా

కేంద్ర మంత్రిని కలిసిన ఎస్పీ



కేంద్రమంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి అర్బన్: గోరంట్ల మండలం పాలసముద్రం సమీపంలోని నాసిన్ (నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్ అన్‌ఫ్రాటెక్ ట్యాక్సెస్ అండ్ నార్కోటిక్స్) శిక్షణా కేంద్రంలో శుక్రవారం జరిగిన 74వ బ్యాచ్ ఐఆర్ఎస్ ఉద్యోగుల పాసింగ్ అవుట్ పరేడ్‌కు విచ్చేసిన కేంద్ర మంత్రి పంకజ్‌చౌదరిని ఎస్పీ రత్న మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి మాట్లాడారు. ఎస్పీ వెంట పలువురు పోలీస్ అధికారులు ఉన్నారు.

ఎంటెక్ ఫలితాలు విడుదల

అనంతపురం: జేఎన్‌టీయూ (అనంతపురం) పరిధిలో గత నవంబర్, డిసెంబర్ మాసాల్లో నిర్వహించిన ఎంటెక్ మూడో సెమిస్టర్ (ఆర్–21) రెగ్యులర్, సప్లిమెంటరీ, బీఫార్మసీ నాలుగో సంవత్సరం ఒకటో సెమిస్టర్ (ఆర్–19) రెగ్యులర్, సప్లిమెంటరీ, ఒకటో సెమిస్టర్, రెండో సెమిస్టర్ (ఆర్–15) సప్లిమెంటరీ ఫలితాలను డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ వి.నాగప్రసాద్ నాయుడు శుక్రవారం విడుదల చేశారు. ఫలితాలను జేఎన్‌టీయూ వెబ్‌సైట్‌లో చూడవచ్చని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సీఈ ప్రొఫెసర్ ఏపీ శివకుమార్, అడిషనల్ కంట్రోలర్లు అంకారావు, జి.రాజు, ఎస్. శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అదిగో చిరుత



ముదిగల్లు సమీపంలో గుట్టపై చిరుత ఉన్న దృశ్యం

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం మునిసిపాలిటీ పరిధిలోని ముదిగల్లు గ్రామ సమీపంలో గుట్టపై శుక్రవారం చిరుత కన్పించింది. ఉదయం గ్రామస్తులు చిరుత గుట్టపై ఉండటాన్ని చూసి శబ్దాలు చేస్తూ కేకలు వేశారు. దీంతో అది గుట్టపై నుంచి కిందిభాగంలో ఉన్న గుహలోకి వెళ్లిపోయింది. గ్రామస్తుల ద్వారా విషయం తెలుసుకున్న అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్ షాన్‌వాజ్, బీట్ ఆఫీసర్ నాగేనాయక్ వైల్డ్ ప్రొటెక్షన్ వాచర్లతో కలిసి చిరుత సంచరించిన ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడి నుంచి చిరుతను తరిమేందుకు చర్యలు చేపట్టారు. మళ్లీ కన్పిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. కాగా..చిరుత సంచారంపై స్థానికులు భయాందోళన చెందుతున్నారు. రాత్రి సమయాల్లో జనావాసాల్లోకి వస్తే తమ పరిస్థితి ఏంటని అంటున్నారు.

లాభాల పూదోట

నార్పల, బుక్కరాయసముద్రం మండలాల్లో పూల సాగు చేపట్టిన రైతుల ఇంట సిరుల వర్షం కురుస్తోంది. గడ్డం నాగేపల్లి, వెంకటాంపల్లి గ్రామ పొలాల్లో చామంతి పూల తోటలు, బుక్కరాయసముద్రం వద్ద బంతి పూల తోటలు కనువిందు చేస్తున్నాయి. వరుసగా పండుగలు, శుభకార్యాలు రానుండడంతో ఇటు రైతులకు అటు వ్యాపారులకూ లాభాల పంట పండనుంది. సాధారణ పంటల్లో నష్టాలు చవిచూసిన రైతులు తాజాగా పూల సాగుతో ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. పూల దిగుబడులను బెంగళూరు, హైదరాబాదు, రాజమండ్రి , విజయవాడ ప్రాంతాలకు ఎగుమతి చేస్తూ లాభాలు గడిస్తున్నారు. ప్రస్తుతం కిలో రూ.120 చొప్పున వ్యాపారులు కొనుగోలు చేస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక పూల సాగు ద్వారా టోకు వ్యాపారులు, చిరువ్యాపారులు, కూలీలకు సమృద్ధిగా ఉపాధి లభిస్తోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:



గడ్డం నాగేపల్లి వద్ద సాగులో ఉన్న చామంతి పూలు







చామంతి పూల కోతలో నిమగ్నమైన కూలీలు, కోత కోసిన చామంతులను తూకం వేస్తున్న రైతు, బంతిపూలను కోస్తున్న కూలీలు

రూ.2 లక్షల ఆర్థికసాయం అందజేత

లేపాక్షి: మండలంలోని సి.వెంకటాపురం ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న క్యాన్సర్ బాధిత ఉపాధ్యాయుడు షేక్ ముస్తాఫాకు మండలంలోని ఉపాధ్యాయులు అండగా నిలిచారు. ప్రతి లక్ష మందిలో ఒకరికి సంక్రమించే అరుదైన కార్సినోమా క్లియర్ సెల్ క్యాన్సర్ బారిన ఆయన పడ్డారు. దీంతో ఒక్క రోజు చికిత్సకు రూ.15వేల నుంచి రూ.20 వేల వరకు ఖర్చు వస్తోంది. ఇప్పటి వరకూ రూ.20 లక్షల వరకు ఆయన భరించారు. ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో చికిత్సకు ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న లేపాక్షి మండలంలోని ఉపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది, సి.వెంకటాపురం, ఓబుళాపురం గ్రామస్తులు చలించిపోయారు. వెంటనే రూ.2 లక్షల ఆర్థిక సాయాన్ని పోగు చేసి శుక్రవారం ఎంఈఓ నాగరాజు నాయక్‌తో కలసి బాధిత ఉపాధ్యాయుడికి అందజేశారు. కార్యక్రమంలో ఇస్మాయిల్ ఖాన్, రియాజ్, తిమ్మయ్య, సాయినాథ్, రామలింగం, సురేష్, హిదాయతుల్లా, శ్రీనివాసరెడ్డి, రమణ, క్షీరలింగేశ్వర, విజయశేఖర్, రాందాస్ నాయక్, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.



బాధితుడికి సాయం అందిస్తున్న ఉపాధ్యాయులు

తప్పు చేస్తే హెచ్‌ఎంలదే బాధ్యత

- విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు

అనంతపురం ఎడ్యుకేషన్: పోస్టులను నిలబెట్టుకోవడం కోసం బడుల్లో లేని పిల్లలను అటెండెన్స్‌లో చూపిస్తే హెచ్‌ఎంలపై చర్యలు తప్పవని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు అన్నారు. ఆయన శుక్రవారం సాయంత్రం జిల్లా విద్యాశాఖ అధికారులు, ఎంఈఓలు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలతో వెబెక్స్ నిర్వహించారు. అనంతపురం నుంచి డీఈఓ ప్రసాద్‌బాబు, డిప్యూటీ డీఈఓలు శ్రీనివాసరావు, శ్రీదేవి, ఎంఈఓలు, నూతన ప్రతిపాదిత స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీలోనూ మోడల్ ప్రాథమిక స్కూల్ ఏర్పాటుకు విధివిధానాలు పంపామన్నారు. ఆ మేరకు జిల్లాలో కసరత్తు చేసి పూర్తిస్థాయి జాబితా సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు.

వ్యక్తి బలవన్మరణం

చెన్నేకొత్తపల్లి: మండలంలోని ప్యాదిండి గ్రామానికి చెందిన శ్రీకాంత్‌రెడ్డి (42) ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య హేమావతి, ఓ కుమారుడు ఉన్నారు. పోలీసులు తెలిపిన మేరకు... సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి కొంత కాలంగా వర్క్ ఫ్రం హోం కింద స్వగ్రామంలోని తన ఇంటి నుంచే విధులు నిర్వర్తిస్తున్నారు. కొన్ని నెలలుగా కడుపునొప్పితో బాధపడుతున్న ఆయన శుక్రవారం ఉదయం నొప్పి తీవ్రత తాళలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమి సంహారక మందు తాగాడు. అనంతరం ఈ విషయాన్ని భార్య హేమావతికి ఫోన్ చేసి తెలపడంతో ఆమె ద్వారా విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు ఆగమేఘాలపై ఇంటికి చేరుకున్నారు. అప్పటికే అపస్మారక స్థితికి చేరుకున్న శ్రీకాంత్‌రెడ్డిని ధర్మవరంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ఆయన మృతి చెందాడు. హేమావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు.



శ్రీకాంత్‌రెడ్డి (ఫైల్)

సైబర్ నేరగాళ్ల కుట్ర... పసిగట్టిన విశ్రాంత ఉద్యోగికి సన్మానం

అనంతపురం: 'నీవు క్రిమినల్ కేసులో ఇరుక్కున్నావు. నిన్ను తప్పించాలంటే రూ.30 లక్షలు ఇవ్వాలి' అంటూ సైబర్ నేరగాడు చేసిన ఫోన్ కాల్‌పై వెంటనే స్పందించకుండా అప్రమత్తం చేసిన ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగి నారాయణరెడ్డిని పోలీసులు ఘనంగా సత్కరించారు. వివరాలు... అనంతపురానికి చెందిన నారాయణరెడ్డి ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తూ పదవీ విరమణ పొందారు. ఈ క్రమంలో గత రెండు రోజులుగా ఆయనకు సైబర్ నేరగాడు ఫోన్ చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తూ వచ్చాడు. బెదిరింపులకు తొలుత తలొగ్గకపోయినా... ఆ తర్వాత అనుమానం వచ్చిన ఆయన వెంటనే సైబర్ విభాగాన్ని సంప్రదించాడు. స్పందించిన సైబర్ పోలీసులు ఆయనను టూటౌన్ సీఐ శ్రీకాంత్ వద్దకు పిలుచుకెళ్లారు. అదే సమయంలో సైబర్ నేరగాడు మరోసారి ఫోన్ చేయడంతో ఆ కాల్‌ను సీఐ స్వీకరించి, మాట్లాడారు. సారాంశం మొత్తం విన్న తర్వాత 'నీవు సైబర్ నేరగాడివని తెలుసు. ప్రజలను ఇలా ఇబ్బందులకు గురిచేస్తే చట్టపరంగా కేసు నమోదు చేసి అరెస్ట్ చేస్తాం' అంటూ సీఐ తనదైన శైలిలో మాట్లాడడంతో వెనువెంటనే అవతలి వ్యక్తి ఫోన్ స్విచ్చాఫ్ చేసుకున్నాడు. సైబర్ నేరగాడి పన్నాగాన్ని సమర్థవంతంగా ఎదుర్కొన్న నారాయణరెడ్డిని అభినందిస్తూ పోలీసులు ఘనంగా సన్మానించారు.



నారాయణరెడ్డిని సన్మానిస్తున్న సీఐ శ్రీకాంత్, సైబర్ సెల్ సీఐ జాకీర్

వ్యాపార లావాదేవీలే కారణం

- పట్టుచీరల వ్యాపారిపై హత్యాయత్నం కేసులో వీడిన మిస్టరీ
- నలుగురు నిందితుల అరెస్ట్
- పరారీలో మరో ఇద్దరు
- వివరాలు వెల్లడించిన ఇన్‌చార్జ్ డీఎస్పీ వెంకటేశ్వర్లు



వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌చార్జ్ డీఎస్పీ వెంకటేశ్వర్లు

హిందూపురం అర్బన్: వ్యాపార లావాదేవీల్లో చోటు చేసుకున్న విభేదాల కారణంగా పట్టుచీరల వ్యాపారి గొంతు కోసి ఉడాయించిన కేసులో నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఇన్‌చార్జ్ డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం హిందూపురం పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను ఆయన వెల్లడించారు. ముదిరెడ్డిపల్లికి చెందిన పట్టుచీరల వ్యాపారి నారాయణరెడ్డి వద్ద అదే గ్రామానికి చెందిన బాలకృష్ణ నాలుగేళ్లు డ్రైవర్‌గా పనిచేశాడు. ఆర్థిక పరమైన విభేదాలు తలెత్తడంతో నాలుగు నెలల క్రితం పని మానేసి, సొంతంగా ఆటో పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో నారాయణరెడ్డి వద్ద తాను పనిచేస్తున్న సమయంలో పరిచయమైన ముదిరెడ్డిపల్లి, ధర్మవరంలోని కస్టమర్లను కలసి వారి చీరలను స్వయంగా కర్ణాటకలోని యలహంకలో పాలిష్ చేయించి తిరిగి అందజేస్తూ వచ్చాడు. ఈ క్రమంలో సరైన బిల్లులు లేకుండా చీరలు ట్రాన్స్‌పోర్టు చేస్తున్న బాలకృష్ణ వాహనాలను ఇటీవల జీఎస్టీ అధికారులు పట్టుకుని జరిమానా విధించారు. దీని వెనుక నారాయణరెడ్డి ప్రమేయం ఉందని బాలకృష్ణ అనుమానించాడు. దీంతో హిందూపురంలోని శాంతినగర్ నివాసి ఫకృద్దీన్ అలియాస్ చోటు, కర్ణాటకలోని గౌరీబిదనూరుకు చెందిన ముబారక్, ఫరూక్‌ను కలసి నారాయణరెడ్డిని హతమార్చేందుకు రూ.5 లక్షలు ఒప్పందం చేసుకుని టోకన్ అడ్వాన్స్ ఇచ్చాడు. ఈ నెల 8న నారాయణరెడ్డి ధర్మవరం నుంచి బెంగళూరుకు చీరలు పాలిష్ చేయించేందుకు తీసుకెళ్లిన విషయం తెలుసుకున్న ఫకృద్దీన్... తన స్నేహితులను అప్రమత్తం చేశాడు. అనంతరం అందరూ హిందూపురంలో సమావేశమై చర్చించుకుని నారాయణరెడ్డికి ఫోన్ చేశారు. తాము కలసి చాలా కాలమైందని, ఈ సారి కలిసి మందు పార్టీ చేసుకుందామంటూ ఆహ్వానించారు. ఈ ఉచ్చులో చిక్కుకున్న నారాయణరెడ్డి తిరుగు ప్రయాణంలో అర్ధరాత్రి హిందూపురంలోని లోటస్ స్కూల్ సమీపంలో ఫకృద్దీన్, ముబారక్, ఫరూక్, సైపుల్లా, ఉమర్‌తో భేటీ అయ్యాడు. అందరూ కలసి మద్యం తాగుతుండగా ఐదుగురు నారాయణరెడ్డి వెనుకకు చేరుకుని బలంగా పట్టుకున్నారు. అనంతరం కత్తితో గొంతుపై పొడిచాడు. రక్తం మడుగులో పడి ఉన్న నారాయణరెడ్డిని చూసి మృతి చెంది ఉంటాడని భావించి అక్కడి నుంచి జారుకున్నారు. కాసేపటికి ఆ మార్గంలో వెళుతున్న ఆటో డ్రైవర్... రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతున్న నారాయణరెడ్డిని గుర్తించి వెంటనే స్థానిక జిల్లాస్పత్రికి తీసుకెళ్లాడు. వైద్యుల సూచన మేరకు కుటుంబసభ్యులు బెంగళూరులోని ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో శుక్రవారం ఉదయం తూముకుంట చెక్‌పోస్టు వద్ద తచ్చాడుతున్న బాలకృష్ణ, ఫకృద్దీన్, ముబారక్, మహమ్మద్ ఫరూక్‌ను సీఐ ఆంజనేయులు గుర్తించి అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న సైపుల్లా, ఉమర్ కోసం గాలింపు కొనసాగుతోంది. పట్టుబడిన వారి నుంచి ద్విచక్ర వాహనం, రూ.63 వేల నగదు, కత్తి, నాలుగు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

ఔత్సాహికులకు ఇంటర్న్‌షిప్ అవకాశం

అనంతపురం: ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్ పథకం కింద యువతకు ఉత్తమమైన ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు అనంతపురం జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. ఈ పథకం ద్వారా యువతకు ప్రతిష్టాత్మకమైన కంపెనీల్లో పని అనుభవం, నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక సాయం అందుతుందన్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు. అర్హులైన వారు దరఖాస్తులను నేరుగా https://pminternship.mca.gov.in/login/ వెబ్‌సైట్ ద్వారా అందజేయవచ్చు. పూర్తి వివరాలకు కరీముల్లా (83413 66022), సంజామల రఫీ (94906 22810)ను సంప్రదించవచ్చు.

అత్యుత్తమ 500 కంపెనీల్లో ఇంటర్న్‌షిప్

దేశంలోనే అత్యుత్తమంగా ఖ్యాతి గాంచిన 500 కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ చేయడానికి అవకాశం కల్పిస్తారు. ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన వారికి స్టైఫండ్ కింద నెలకు రూ.5 వేలు చెల్లిస్తారు. ఇందులో రూ.4,500ను కేంద్ర ప్రభుత్వం, రూ.500ను కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద కంపెనీ భరిస్తాయి. అలాగే వన్–టైమ్ ఫైనాన్షియల్ అసిస్టెన్స్ కింద కేంద్ర ప్రభుత్వం నేరుగా రూ.6 వేలను ఒకేసారి చెల్లిస్తుంది. ప్రధాన మంత్రి బీమా యోజన, ప్రధాన మంత్రి ప్రమాద బీమా యోజన కింద పరిరక్షణ కల్పిస్తారు. 18 నుంచి 24 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలి. పదో తరగతి, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, బీటెక్, బీబీఏ, బీఫార్మసీ, పూర్తి చేసిన వారు, చివరి సెమిస్టర్‌లో చదువుతున్నవారు అర్హులు .

వివాహిత కిడ్నాపర్ల అరెస్ట్

తాడిపత్రి రూరల్: వివాహితను కిడ్నాప్ చేసి, నిలువుదోపిడీ చేసిన కేసులో నిందితులను అరెస్ట్ చేసినట్లు సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. వివరాలను శుక్రవారం ఆయన వెల్లడించారు. కర్నూలు జిల్లా ప్యాపిలి మండలం గుడిపాడుకు చెందిన వీరాంజనేయులు కుటుంబసభ్యులు, తాడిపత్రిలోని గన్నెవారిపల్లి కాలనీకి చెందిన వివాహిత రేణుక కుటుంబసభ్యులు కలసి గతంలో తాడిపత్రి మండలంలోని సజ్జలదిన్నె సమీపంలో ఉన్న బండల పాలీష్ యూనిట్‌లో కార్మికులుగా పనిచేశారు. ఈ పరిచయంతో అప్పట్లో తన వ్యక్తిగత అవసరాల కోసం రూ.30 వేలను రేణుకాతో అప్పుగా తీసుకున్న వీరాంజనేయులు ప్రామిసరీ నోట్ రాయించి ఇచ్చాడు. వడ్డీతో సహా అప్పు తీర్చినా ప్రామిసరీ నోట్ రేణుక ఇవ్వలేదు. దీంతో వారి మధ్య విభేదాలు చోటు చేసుకోవడంతో తన కుటుంబసభ్యులతో కలసి వీరాంజనేయులపై గతంలో రేణుక దాడి చేయించింది. దీంతో కక్ష పెంచుకున్న వీరాంజనేయులు... తన భార్య రాధమ్మ, అత్త భూలక్ష్మితో కలసి పథకం వేశాడు. గురువారం వ్యవసాయ కూలి పనులకు తోటి కూలీలతో కలసి ఆటోలో యుగుదూరుకు వెళుతున్న రేణుకను మార్గమధ్యంలో అడ్డుకుని స్కార్పియో వాహనంలో కిడ్నాప్ చేశారు. ఇందు కోసం వాహనాన్ని ప్యాపిలి నుంచి అద్దెకు తీసుకువచ్చారు. అనంతరం ఆమె శరీరంపై ఉన్న బంగారు మాంగల్యం చైన్, కమ్మలు, మాటీలను లాక్కొని వదిలేసి, ఉడాయించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో శుక్రవారం ఉదయం వీరాంజనేయులుతో పాటు ఆయన కుటుంబసభ్యులను, స్కార్పియో డ్రైవర్ దశరథ్‌ను అరెస్ట్ చేసి, బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

నీటి కుంటలో పడి బాలుడి మృతి

బుక్కరాయసముద్రం: ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి ఓ బాలుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... బుక్కరాయసముద్రం మండలం పసులూరు గ్రామానికి చెందిన ఓబులేసు, అంజినమ్మ దంపతుల కుమారుడు ప్రసాద్ (11) 5వ తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు శుక్రవారం నుంచి సంక్రాంతి సెలవులు ప్రకటించడంతో ఇంటి వద్దనే ఉన్న బాలుడు... స్నేహితులతో కలసి కమ్మగుడ్డం క్వారీ వద్ద నీటి గుంత వద్ద ఈతకు వెళ్లాడు. లోతైన ప్రాంతానికి వెళ్లడంతో నీట మునిగి ఊపిరి ఆడక మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని స్థానికుల సాయంతో కుంటలో నుంచి బాలుడి మృతదేహాన్ని వెలికి తీయించారు. ఘటనపై బీకేఎస్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.